మంచి కథల్ని మళ్ళీ మళ్ళీ చదువుకోవడం కోసం కథలన్నింటినీ ఒకే గుత్తిగా అందిస్తున్నాం

కోనసీమ కొబ్బరాకు గాలి, పంట పొలాల మీద నుండి వచ్చిన పైరగాలి వంటికి తగిలేసరికి ఉత్సాహం మరింత పెరిగింది వెంకట్రాయుడుగారికి. ఊరు వదిలి మూడునెలలైంది.

శ్రీను అన్నీ చూసుకోబట్టే హైదరాబాద్‌లో తను అనుకున్న కార్యం నిర్విఘ్నంగా పూర్తయింది కారు అద్దాలన్నీ దింపేసుకుని పరిసరాలు పరిశీలిస్తూ ఆనందంతో ఉక్కిరిబిక్కిరైపోతూ అనుకున్నాడు.




# ఏమి సేతురా...!

-జి.పద్మావతి

సరాసరి కారులో మిల్లు దగ్గరకెళ్ళిపోయారు.

"అరే శీనూ...! చాలావరకు పని పూర్తయిపోయింది. డైరెక్టర్ హీరోయిన్ని తీసుకుని వారంరోజుల్లో వస్తానన్నాడు"

"నువ్వు చూసావా బాబాయ్" ఉత్సాహంగా అడిగాడు శ్రీను.

'లేదురా! అదొకటీ... సినిమాకు పేరూ నిర్ణయం జరగలేదు. మన మిల్లు దగ్గర పెద్దిల్లు శుభ్రం చేయించు. ఇన్నాళ్ళూ ఏవేవో షూటింగ్‌లకు ఇచ్చాను. ఇన్నాళ్లకి నేనే స్వంతంగా తీస్తున్నాను. చాలా సంతోషంగా ఉందిరా శీనూ. ఎవరికీ తెలియనివ్వలేదు కదా" కాస్త నింపాదిగా అడిగాడు.

"లేదు బాబాయ్... కానీ రేపైనా తెలుస్తుందిగా. పిన్ని ఇవ్వాళ సాయంత్రం ఫ్లైట్‌కి వచ్చేస్తుంది."


నేనే వెళ్లి తీసుకొస్తానని కారు తీసుకెళ్లాడు శీనూ. అవేం వినబడలేదు ఆయనకు.

'మంచి సినిమా' అన్న ఆలోచనే తప్ప ఏమీ పట్టట్లేదు, వినబడడం లేదు.



## యోగా భామ ఇలియానా

'సన్నాసన్నని నడుము'తో కుర్రకారును వెర్రెక్కించే ఇలియానాకి కూడా యోగా మీద మోజు పుట్టిందిట. 'వంటికి యోగా ఎంతో మంచిది' అని ఎంతో నమ్మకంగా చెబుతోంది. నవంబర్ నెల నుంచే యోగా సాధన చేస్తున్న తనకి ఈ కొద్ది రోజుల్లోనే తనలో ఎంతో మార్పు అనుభూతికొస్తోందిట. హాయిగా ప్రశాంతంగా అనిపిస్తోందిట యోగా చేయడం వల్ల. ఇకపై యోగా కంటిన్యూ చేస్తా అంటోంది ఇలియానా.




***

"బాబాయ్‌కి ఖాళీలేదు పిన్నీ. నువ్వెళ్లిందగ్గర్నుంచీ చాలా బిజీగా ఉన్నాడు" అతనికి ఎప్పుడు పిన్నికి చెప్పేద్దామా అన్నట్టున్నాడు. ఏర్‌పోర్ట్‌లో ఆమెను రిసీవ్ చేసుకుని కారులో ప్రయాణంచేసి సాయంత్రానికే కొంకాపల్లి చేరుకున్నాడు.

ఊళ్లో సందడి కనబడలేదు.

అరుగులమీద ఆడవాళ్లు లేరు. చెట్లకింద బాతాఖానీ కొట్టే మగాళ్లు లేరు.

"శీనూ! మళ్లీ ఊళ్లో ఏదన్నా షూటింగ్ జరుగుతోందా?" అనుమానంగా అడిగింది.

కోనసీమ అందాలు పుష్కలంగా ఉండే అక్కడ షూటింగ్‌లు జరగడం సాధారణమే అయినా జనం వెళ్లకుండా ఉండరు. 'ఇంటికొచ్చేవరకూ పిన్నికి ఏమీ చెప్పొద్దు' అని బాబాయ్‌కి మాట ఇచ్చాను అనుకుంటూనే 'నేను మళ్లీ వస్తాను పిన్నీ' అని చెప్పి సామాను లోపలపెట్టి వెళ్లిపోయాడు.

'ఎవరూ రాలేదు. అమెరికా ప్రయాణం గురించి ఎవరూ ప్రశ్నించడం లేదు. జనం ఎంత మారిపోయారు' అనుకుంది. ఇల్లంతా తిరిగి చూసుకుంది. గౌరి ఇల్లు బాగానే వుంచింది.

కానీ ఇంటి పరిస్థితి చూస్తుంటే ఈయనగారు మళ్లీ ఏదో ఘనకార్యం చేస్తున్నట్లు అనిపించింది.

ఊళ్లో అన్నయ్యకి ఫోన్ చేసి ఇంటికి రప్పించి ఆరా తీయడం మొదలుపెట్టింది.

***

"అయ్యో...అయ్యో... రామ రామా! మొన్న సంవత్సరం ఏదో డబ్బింగ్ సినిమాకి డబ్బులు పెట్టారు. కొంతలో కొంత లాభమన్నారు. ఇంక మాట్లాడకుండా మీ పని మిమ్మల్ని చూసుకొమ్మంటే నన్ను పిల్లాడి దగ్గరకు పంపించి ఇన్ని పెద్ద పన్లు చేస్తారా? కృష్ణా రామా అనుకోకుండా మీకెందుకండీ ఇలాంటివన్నీనూ..." డబ్బు ఎంత ఖర్చయిందో అర్థంకాక శోకాలు తీసింది.

"నేను కృష్ణా రామా అనుకోను. ఎప్పటినుండో సినిమా తీయాలని నా కోరిక. పోయేలోపు నా కోరిక తీర్చుకోవాలి" సీరియస్‌గా అన్నాడు.

"అయ్యో...అవేం మాటలండీ" అంది సూత్రాలు తీసి కళ్లకద్దుకుంటూ.

"నీకు నా మీద ప్రేమకాదు, డబ్బు ఖర్చు అయిపోతుందని. ఇంతకుముందు ఇంత లాభమొస్తుందే, మంచి డైరెక్టర్, పాటలు బాగా పాడించాం. ఇంకో రెండు నెలల్లో అంతా అయిపోతుంది"

"అయ్యో అంతా అయిపోతుందంట. ఎంత కష్టపడి దాచానండీ. ఇక్కడితో ఆపేయండి" అందావిడ.

"నువ్వు కాదు కదా చివరకు ఆ భగవంతుడు వచ్చినా నన్ను ఆపలేరు. మనిషికి కోరిక వుండాలి, ఆశ వుండాలి. భయపడితే ఏదీ చేయలేం" అంటూ కండువా మీద వేసుకుని ఉయ్యాల బల్లమీద నుంచి లేచారు వెంకట్రాయుడుగారు.

ఊళ్లో తెలిసినవాళ్లందరికీ ఫోన్ చేసి మీటింగ్ పెట్టేసిందావిడ.

"ఏదో సావిత్రమ్మ సినిమాలు ఇష్టంకదా చూస్తున్నాడు అనుకున్నా. పాత సినిమా సీడీలన్నీ చూస్తుంటే ఏదో బిజినెస్ చేస్తున్నాడు కదా అనుకున్నానుగానీ డిస్ట్రిబ్యూటర్ నుండి నిర్మాత అవుతాడనుకోలేదు" అని పైపైకి ఆవిడ కోసం అటూ ఇటుగా అందరూ అన్నారుగానీ ప్రతివారికీ ఉత్సాహంగా ఉంది.

"అన్నయ్యా! మనకెందుకు చెప్పు. ఏదో బిజినెస్ వెలగబెడ్తున్నారు కదా. ఇంతకుముందు ఏవో చేసి చేయి కాల్చుకున్నారు. వదిలేయమని చెప్పు నువ్వయినా'' కాస్త గట్టిగానే అంది సూర్యకాంతం.

"అదేమన్నా తప్పా పిన్నీ. ఎవరో ఒకరు ఎప్పుడో అప్పుడు నడవరా ముందుకు' అని సినీ కవి చెప్పారు తెలుసా'' శీను అన్నాడు.

"ఆయనెవరో తెలీదుగానీ పాట పాడుతున్నాడు చూడు... అసలు నువ్వే ఎక్కిస్తున్నావేం బాబాయికి'' శీను తండ్రి అన్నాడు.

"జనంలో పాపులారిటీ సినిమా వల్లే వస్తుంది. నాకూ చిన్న పాత్ర ఇస్తున్నాడు బాబాయ్'' గబుక్కున అనేసాడు శీను.

"అయినా నేను సినిమా తీస్తే మీకందరికీ ఎందుకు? ఇంత మీటింగ్ అవసరమా? చాలావరకు పని పూర్తయింది. నీ పేరు మీదనే బ్యానర్ పెట్టాం. సూర్యకాంత ప్రొడక్షన్స్. నువ్వు వచ్చేవరకు హైదరాబాద్‌లోనే ఉన్నాను'' భార్యతో అన్నారు వెంకట్రాయుడుగారు.

"మనకి అనుభవంలేదు. వాటి విషయాలు ఏం తెలుసని మీ బావ దిగుతున్నారు అని మా చెల్లెలు గొడవ చేస్తోంది'' నీళ్లు నములుతూ అన్నాడు రాయుడుగారి బావమరిది.

"ఏం తెలుసు... వ్యవసాయం తెలుసా? వంట తెలుసా? అమెరికా తెలుసా? దిగితే అదే అర్థమవుతుంది'' అని సినీ ఫక్కీలో చెప్పాడు.

ఆవిడ మాట్లాడకపోయేసరికి అందరూ ఆయన చుట్టూ మూగేసారు "ఏం సినిమా... ఏం సినిమా?'' అంటూ.

"మన తెలుగు సినిమారా. ఎస్వీ రంగారావులాగా ఎత్తుగా, హుందాగా ఒక పాత్ర, సావిత్రమ్మ లాంటి కోడలు, ఇదిగో డబ్బు లెక్కపెట్టుకునే సూర్యకాంతంలాంటి అత్తగారు...''

"రీమేక్ తీయబోతున్నారా బాబాయ్. ఇప్పుడంతా రీమేక్‌లే ఫ్యాషన్' శీను అన్నాడు మధ్యలో. "రకరకాల అమ్మాయిలు వస్తారు మరి. చిన్న పాత్రతో అలా అలా పెద్ద స్టార్‌వయిపోవాలి'' అతని కళ్లల్లో నక్షత్రాలు మెరిసాయి.

"అయ్యగోరూ.. బస్సులో శానామంది వచ్చేరు. ఈరోయిన్ను రేపు వచ్చేత్తాన్నారంట'' ఆయన అసిస్టెంట్ అని చెప్పుకునే వెంకన్న వార్త మోసుకొచ్చాడు.

"నువ్వెందుకురా గింగిరాలు తిరిగి పోతున్నావు'' శీను అన్నాడు.

"నాకూ సిన్న పాత్ర ఇయ్యండి అయ్యగోరూ. ఈరోయిన్ను వెనకాలే ఉండాల'' కోరిక వెలిబుచ్చాడు వెంకన్న.

"నా గోడు ఎవరూ వినడంలేదు. అందరూ ఆయనవేపు మళ్లిపోయారు.. ఏం జరుగుతుందో ఏమో'' తనలో తనే అనుకుంది సూర్యకాంతం.

★★★

షూటింగ్ మొదలైంది. జరుగుతోందిగానీ ఇన్నాళ్లా ఎవరికీ ఎక్కువగా తెలియదు.

ఇప్పుడు ఆ నోటా ఈనోటా తెలిసాక పొద్దునే వంటలు చేసుకుని మరీ పిల్లలతో మిల్లు దగ్గర గెస్ట్‌హౌస్‌కి వచ్చేసేవారు. టీవీవాళ్లు, కేబుల్ టీవీవాళ్లతో ఇంటి దగ్గర, మిల్లు దగ్గర మహా సందడిగా ఉంది. రాయుడుగారు ఆ తరువాత శీనుగాడు వరుస ఇంటర్వ్యూలే. హీరోయిన్ ఊళ్లోకొచ్చింది అది నిర్మాతకంటే ముందు ఊళ్లో తెలిసింది. ఆయన స్పాట్‌కెళ్లారు.

"ఏదయ్యా డైరెక్టర్ హీరోయిన్ను పిలువు''

"అదేంటి సార్... ఎదురుగా వుంటేనూ'' ఆశ్చర్యంగా అన్నాడు.

"ఈ అమ్మాయి ఫ్లైట్‌లో దిగి తరువాత కారులోనేగా వచ్చింది. ముంబై నుండి నడిచివచ్చినట్లుగా ఎండిపోయిందేమిటి?''

"అలా బక్కగానే ఉండాలండీ. ఇప్పుడదే ఫ్యాషన్''

"ఈ అమ్మాయి నవ్వుతుంటే నాకు నీరసం వచ్చేస్తోంది డైరెక్టర్. నీ సెలక్షనేం బాగాలేదు.మన సావిత్రమ్మ నవ్వితే చూడు, నిండుగా మన పక్కింటి వారి కోడల్లాగా, మనమ్మాయిలాగా అనిపించదూ, కొంచెం లావుచేయండి'' కొంచెం స్పీచ్ ఇచ్చారు వెంకట్రాయుడుగారు.

"సరేలెండి. బరువు పెరగమందాం'' అన్నాడు డైరెక్టర్.

"నీ పేరేంటమ్మాయ్'' రాయుడుగారు అడిగారు.

"మిస్ మితుఘషి నిశ్చేష్ట'' జుట్టు వెనక్కు తోసుకుంటూ చెప్పిందా బక్కపలచని పిల్ల.

"అదేంటి తెలుగు వత్తులున్నీ నీ పేరులోనే ఉన్నాయిలాగుంది. పలకడమే కష్టం డైరెక్టరూ.''


## మతిమరుపు తెచ్చిన చిక్కు

చైనాలో 80 ఏళ్ల వాంగ్‌జూజున్ తన పెంపుడు కుక్కని తన కారులో వదిలి దానికి తాళం వేసి ఆ కారుని రిపేరుకు ఇచ్చాడట. తరువాత ఏ గ్యారేజీవద్ద తన కారుని వదిలాడో మర్చిపోయాడు. అలా నెల గడిచింది. ఆ గ్యారేజీ పక్కనున్న వ్యాపారులు కారులోని కుక్క పరిస్థితికి జాలిపడి కారు కిటికీ సందులోంచి దానికేదో ఒకటి తినిపించేవారట. ఆఖరికి కారులోంచి చెడువాసన రావడంతో వాళ్లు ఆ కారు అద్దాల్ని పగలగొట్టారు. అయినా ఆ కుక్క మాత్రం కారుని వదిలి బయటకు రాలేదు. దానికి యజమానిమీద అంత విశ్వాసం. ఆఖరికి కారులోని పేపర్ల ఆధారంతో ఎవరో వాంగ్ అడ్రస్ కనుక్కొని అతనికి అక్కడ జరిగినదంతా తెలియజేసి పుణ్యం కట్టుకున్నారు.

## జంతువులకి కోట్లు

స్విట్జర్లాండ్‌లో ఒక జూలో జంతువులు బోరుకొట్టి జబ్బు పడకుండా ఉండడానికి వాటికి వినోద కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారుట. వాటికి రకరకాల రెడ్‌కోట్లు తొడిగించి క్రీడల కోసం ఫుట్‌బాల్స్, ప్లాస్టిక్ సంచులు, కర్రబొమ్మలు మొదలైనవన్నీ సప్లై చేస్తున్నారుట.

-తటవర్తి



"వాళ్ల నాన్నది చైనా అంట, అమ్మదేమో ఇండియానట. వెరైటీ కోసం ఆ పేరు పెట్టారుట" డైరక్టర్ చెవిలో చెప్పాడు.

"అన్నీ నువ్వు చెబుతావేంటి. ఆ అమ్మాయిని మాట్లాడమను"

"తెలుగు అర్థం కాదండీ సారూ. మీకెందుకు నేను సినిమా బాగా తీస్తానుకదా" హామీ ఇచ్చాడు.

"తెలుగురాదు, తెలుగు మొహంలా లేదు. ఎలా బావుంటుంది?" విసుక్కున్నాడాయన.

***

"బాబాయ్! హీరోయిన్‌కి అస్సలు బాగాలేదంట. ఇక్కడ మన అరుగు మీద డాక్టర్ వాళ్లకు పని చేయడంట. సిటీ కెళ్లాలంటున్నారు" శీను కంగారుపడుతూ చెప్పాడు.

"అసలా పిల్లకు వంట్లో ఏం వుందని బాగోకపోవడానికి" అంటూనే



## సరికొత్త బాధ్యతలు!

వచ్చే జనరల్ ఎలక్షన్స్‌లో సినీతారల జోరు ఎక్కువగానే వుండేట్టు కనిపిస్తోంది. దాదాపు అన్ని పార్టీల్లోనూ సినిమా వాళ్ల 'హల్‌చల్' వుండేట్టుంది. ఇందులో భాగంగానే కాంగ్రెస్ తరఫున ప్రచారం చేసే తారల జాబితాలోకి నిన్నటి గ్లామరస్ స్టార్ 'శ్రీదేవి' కూడా చేరుతున్నదని చెబుతున్నారు. శ్రీదేవి తెలుగు ప్రేక్షకుల్లో వున్న క్రేజ్ దృష్ట్యా ఆమె చేత కాంపెయినింగ్ చేయించాలని, ఈ విషయంలో ఆమెని ఒప్పుకునేలా ఒత్తిడి తీసుకొచ్చే బాధ్యత హీరో కృష్ణకి అప్పచెప్పినట్టు ఫిలింనగర్ కబుర్లు. చూద్దాం, శ్రీదేవి ఈ విషయంలో ఏం చేస్తుందో!




కంగారుగా వెళ్లారు రాయుడుగారు.

"విషాహారం తిన్నంతగా తేడా వచ్చేసింది. ఇంతకీ ఏం పెట్టారు?" అరుగుమీద డాక్టర్ అడిగాడు.

"ఏముందీ... సున్నుండలూ, కజ్జికాయలు, పరవాన్నం, పులిహోరా..."

"మన తెలుగు వంటలు వాళ్లకు నప్పవండీ. అసలా అమ్మాయి ప్రొద్దునే తేనెతొనలు, సాయంత్రం పుల్కా తిని ఫ్రూట్ సలాడ్ తాగుతుందట"

"అయ్యో తేనెతొనలా. మా ఆవిడ నిన్ననే చేసింది" అంటూ నలుగురు ఆ స్వీట్ తీసుకుని నిముషాల్లో ప్రత్యక్షమయ్యారు.

"తేనె తొనలంటే ఇవికాదు, పనస తొనలు తేనెలో ముంచుకుని తింటుందట' డైరెక్టర్ చెప్పాడు.

ఈ లోపు డాక్టర్ సెలైన్ పెట్టారు.

కొంచెం త్వరగానే కోలుకుంది.

హీరోయిన్ తల్లి గొడవ చేసి ఇంగ్లీషు, హిందీ కలిపి అందర్నీ తిట్టేసి కూతుర్ని తీసుకుని వెళ్లిపోయింది. తలపట్టుకుని కూర్చున్నారు రాయుడుగారు.

"అయినా తెలుగురాదు, తెలుగుతనం ఎలా వస్తుంది డైరెక్టర్. మూడు పాటల షూటింగ్ అయిపోయింది. డబ్బు కూడా చాలా ఖర్చయింది. ఇప్పుడు ఎలా?"

"గర్ల్ ఫ్రెండ్‌తో పాటలూహించుకుంటున్నట్లు పెట్టేసి ఇంకో హీరోయిన్ని పెడదాం" తెలివిగా చెప్పాడు శీను.

రాయుడుగారి పనమ్మాయి గౌరమ్మ భోజనాలు తెచ్చింది. ఆయనకు మంచి ఆలోచన వచ్చింది.

కోలమొహం, సిరిజుట్టు, నల్లటి కళ్లు... మంచి ఆకర్షణీయంగా ఉండే శరీరంతో చామనఛాయలో నిండుగా ఉన్న గౌరిని చూడగానే సావిత్రమ్మలాగే ఉంది.

గౌరే మన హీరోయిన్ నిర్ధారణగా చెప్పేసారు.

ఎగిరి గంతేసింది గౌరి.

అలా గౌరమ్మ శ్రీగౌరిగా మారిపోయి హీరోయిన్ అయిపోయింది. ఉన్న వాళ్లందరూ కలసి షూటింగ్ పూర్తి చేసారు. రాయుడుగారు ఇంక పట్టించుకోలేదు.

ఖర్చయినా తెలుగుసినిమా తీసాననుకున్నారు.

***

"బాబాయ్! మనం ముందు నుండే క్లిప్పింగ్స్, అవీ టీవీలో చూపిద్దాం. మన కోనసీమ కథ, మన తెలుగుదనం ఉట్టిపడే సినిమా అని యాడ్స్ ఇప్పిస్తే బాగా పేరు వచ్చి డబ్బులు వస్తాయి" అంటూ ఐడియా ఇచ్చాడు శీను.

"మరి మన డైరెక్టర్ ఇంకా సినిమాకి పేరు పెట్టలేదుకదా. ఏమయ్యా ఏమని పెడదాం?" అనడిగారు రాయుడుగారు.

"కోడలికి, పెరట్లో ఆవుకు సంబంధించిన కథ కాబట్టి 'పెరట్లో పాడావు' అని నిర్ణయించాను" కాలరెగరేస్తూ చెప్పాడు.

"పాడావా? పాడి ఆవా?" ఆర్ద్రోక్తిగా అడిగారు.

"అంత డైరక్టుగా పేరు పెట్టకూడదండీ. పాడావు అనే పెట్టాలి" గట్టిగా చెప్పాడు.

***

అన్నీ గబగబా శరవేగంతో జరిగాయి. ప్రీమియర్ షో వేయించారు.

యాడ్స్ వచ్చాయి. వన్ ఫైన్ మార్నింగ్ మంచి నిద్రలో ఉన్న రాయుడు గారికి వీధిలో గోల వినబడేసరికి మెలకువ వచ్చింది.

కళ్లు నలుపుకుంటూ "ఏమిట్రా శీనూ" అని అడిగారు.

"బాబాయ్! సినిమాలో గారీవేసిన లక్ష్మి పాత్రని అత్తగారితో 'లచ్చీ...లచ్చీ' అనిపించి ఆ పేరును కించపరచారు అని ఆ పేరుగలవాళ్లంతా ధర్నా చేస్తున్నారు.అంతా గొడవ గొడవగా వుంది. త్వరగారా' అని పిలుచుకువెళ్లాడు.

'యాడ్ చూస్తేనే ఇంత గొడవా?' అనుకున్నాడు.

లక్ష్మీ పేరు మీద దుమారం లేచింది ఆ ఊళ్లో. ఆ పేరు వచ్చిన దగ్గర ఆడియో కట్ చేయాలని డిమాండ్ చేసారు. అత్తగారు కోపం వచ్చినప్పుడల్లా ఏడెనిమిదిసార్లు అని వుంటుంది. పెద్దగా పోయేదేముంది 'ఓకే' అన్నారు రాయుడుగారు.

సినిమా రిలీజ్ చేద్దామనుకున్నారు. డేట్ ఫిక్స్ చేసి కార్యక్రమాలన్నీ పూర్తి చేసారు.

రెండురోజులకు వారి డిస్ట్రిబ్యూషన్ ఆఫీసు ముందు మళ్లీ గొడవ మొదలైంది.

"ఈసారేమిట్రో కనుక్కోనిరా శీనూ" అన్నారు రాయుడుగారు.

"అత్తగారి పాత్ర చేయి చేసుకుని కోడల్ని బాధ పెట్టినట్లు మీ సినిమా క్లిప్పింగ్స్ వస్తున్నాయి. అలా చూపించవచ్చా? ప్రజలకు నేర్పుతున్నారా? ఆడజాతిని అవమానిస్తారా? సినిమా తీసే పద్ధతి ఇదేనా" అని ఒక పెద్దావిడ అంది.

"అది కాదమ్మా. ఈ కథలో అత్తగారి దగ్గర సహనంతో అమ్మాయి ఎలా సమస్యలు ఎదుర్కొందో అని చూపించాం"

"వద్దు. ఇంకా ఆ పాత చింతకాయపచ్చడి మాకొద్దు. ఇప్పుడంతా ఇలా పెళ్లి చేసుకుని అలా పీటల మీంచి వేరుగా అలా కాపురం పెడుతున్నాం. ఆ సీన్లు తీయకుంటే మేం సినిమా రిలీజ్ కానివ్వం" అంది అధ్యక్షురాలు మధ్యలో ఆయన్ని ఆపేస్తూ.

"అందుకే బాబాయ్ హాయిగా ప్రేమకథ తీసుకుందాం ఏ గొడవా ఉండదని చెప్పాను" నసిగాడు శీను.

పెద్దావిడ వచ్చి ఒప్పందం కుదుర్చుకుని టార్చర్ పెట్టే సీన్లు తీయించేయాలని చెప్పింది.

"ఇంకా ఏమైనా ఎవరికైనా అభ్యంతరాలు ఉన్నాయా?" గట్టిగా అన్నాడాయన విసుగ్గా.

"మాకున్నాయి" గట్టిగా వినబడింది ఎవరివో గొంతులు.

"మీకేమిటి నాయనా? పాటలు తీసేయమంటావా? పచ్చగడ్డిమీద డాన్సు చేసారు, గడ్డి పాడయిందని అంటావా? అవి ఏంటో త్వరగా చెప్పు" విసుగ్గా అన్నాడు.

"ఆవుని తీసేయాలి. అవును మీరు చాలాసార్లు ఆవుతో ఫీట్స్ చేయించారు. సినిమా బైటకి వచ్చాక ఎటూ యానిమల్ ప్రొటక్షన్ వాళ్లో వేరే ఎవరైనా అభ్యంతరం పెట్టవచ్చు. ముందు జాగ్రత్త పడండి" హెచ్చరించిందా కంఠం జనం మధ్యలో నుండి.

గుండెల్లో దడ మొదలైంది రాయుడుగారికి. భార్య కాళికావతారం ఎత్తినట్లు, డబ్బు ఖర్చు పెట్టేసావు అంటూ ఆవిడ పోరు, సంఘ సంస్కర్తల పోరు...

అయినా వెనుకాడలేదు.

మార్పులు, చేర్పులు, కటింగులూ అయ్యాక ప్రత్యేకంగా షో వేయించుకున్నారు.

కొన్ని సీన్లలో మాటల్లేవు. కొన్ని మరీ అతికించినట్లు, సందర్భం లేకుండా పాటలు, ఆవు ఎందుకు వచ్చిందో, కోడలు ఎందుకు వచ్చిందో... బుర్ర తిరిగిపోతోంది.

'ఇదేమిట్రా... ఇలా తగలబడిపోయింది. అయినా ప్రపంచంలో ఎన్నో సమస్యలుంటే నా సినిమాలో తప్పులే వెదుకుతున్నారేమిటి జనం? సినిమా తీయడం కష్టమే. ఏం చేద్దామన్నా చేయనివ్వరు. మంచి చెప్పనివ్వరు. ఏమి సేతురా లింగా.. ఏమి సేతురా... గంగలోని సేప కప్పా ఎంగిలంటున్నాయి లింగా!' అని పాడుకుంటూ కండువా భుజం మీద వేసుకుని బయటకెళ్లిపోయారు.

కొసమెరుపు ఏమిటంటే శ్రీగౌరిగా మారిన గౌరి, శీనుగాడు యూనిట్‌తో పాటు హైదరాబాద్ వెళ్లి చిన్న చిన్న వేషాలతో సినిమాల్లో స్థిరపడిపోయారు. రాయుడుగారు వైరాగ్యంలో మునిగిపోయారు.

☆

## మిరకిల్

ఇటలీలో మార్కోమినోజ్జీ అనే మోటారిస్టు తన కారుని 112 కి.మీ వేగంతో పోనిస్తుండగా ఒక ఏడాది కుక్కపిల్లని గుద్దేసాడు. మామూలుగా అయితే ఆ దెబ్బకి కుక్కపిల్ల కారు చక్రాలకింద పడి చచ్చిపోయి ఉండేది కానీ అదెంత వేగంతో వెళ్లిందంటే ఆ దెబ్బకి కుక్కపిల్ల కారు బోనెట్‌కి అతుక్కుపోయిందిట. అతను 24 కి.మీ దూరం వెళ్లాక ఆగిన కారు నుంచి విడివడి క్రిందపడింది. దాన్ని ఆసుపత్రికి తీసుకువెళితే దానికొక కాలు విరిగిందని, కొంచెం గాయాలయ్యాయని, తగిన చికిత్స చేసారు. ఆ కుక్కపిల్ల ఆ ప్రమాదం నుంచి బ్రతికి బయటపడడం ఒక మిరకిల్ అని పోలీసులు అన్నారు.

## ఎక్కువ భాషలవల్ల నష్టం

ఇటీవల ఇజ్రాయిల్‌కి చెందిన టెల్ఎవివ్ యూనివర్శిటీలో ఒక పరిశోధనలో తెల్సిన నిజం ఏమిటంటే బ్రెయిన్ ఏజింగ్‌ను స్లో చేయాలంటే చిన్న వయస్సులో ఎన్ని ఎక్కువ భాషలు నేర్చుకుంటే పెద్ద వయస్సులో అంత లాభమని, కనీసం ప్రతి మనిషి మూడు భాషలైనా నేర్చుకుంటే చాలా మంచిదని!

-తటవర్తి

